క్లుప్తంగా

భైరవ స్వామికి పూజలు


పూజలందుకున్న కాలభైరవుడు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరాన ఉన్న బాలత్రిపుర కాలభైరవ స్వామి దేవాలయంలోని కాలభైరవ స్వామికి ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష గురుజీ ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

న్యాయవాది మృతికి సంతాపం

శ్రీకాకుళం పాతబస్టాండ్: సీనియర్ న్యాయవాది కళ్లేపల్లి ఉమామహేశ్వరరావు శనివారం రాత్రి మృతి చెందారు. ఈయన మృతిపై జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, కార్యదర్శి పొన్నడ రాము, ఎస్.విజయ కుమార్, జి.వాసుదేవరావు, ప్రతాప్ చంద్రలు సంతాపం తెలియజేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. సోమవారం సంతాపసభను నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు తెలిపారు.

అయ్యప్పస్వాములకు అల్పాహారం వితరణ


అల్పాహారం చేస్తున్న అయ్యప్పస్వాములు

శ్రీకాకుళం కల్చరల్: అయ్యప్పస్వాములకు ఉచిత అల్పాహార వితరణ కార్యక్రమం ఆదివారం ప్రారంభమైనది. స్థానిక బొంతావారి వీధిలోని శ్రీకృష్ణార్జున మందిరంలో మిమిక్రీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వందమంది దీక్షాపరులకు అల్పాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఆది, బుధవారాల్లో అల్పాహారాన్ని అందిస్తామని..అయితే ముందుగా తెలియచేయాలని సూచించారు.

జుంబా డ్యాన్స్‌తో శారీరక దృఢత్వం


కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: సంపూర్ణ ఆరోగ్యానికి, మానసికంగా ఫిట్‌గా ఉండేందుకు, శారీరక దృఢత్వానికి జుంబా డ్యాన్స్ దోహదపడుతోందని స్టార్‌వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు అన్నారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన జుంబా డ్యాన్స్ కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, కూన వెంకటరమణమూర్తి, గుడ్ల సత్యన్నారాయణ, పిజి గుప్తా పాల్గొన్నారు. నృత్యం, సంగీతం మన మానసిక స్థితిని మెరుగు పరిచే సాధనాలన్నారు. మనిషి ఒత్తిడిని జయించే శక్తిని జుంబా డ్యాన్స్ ఇస్తుందన్నారు. స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కాసపు జోగినాయుడు, గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.వాసుదేవ్ పాల్గొన్నారు.

దుర్గాదేవి ఆలయ ప్రతిష్ట


అమ్మవారి విగ్రహానికి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

జి.సిగడాం: మండల కేంద్రంలోని దుర్గాదేవి ఆలయ ప్రతిష్ట కార్యక్రమాలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ముగ్గురాటలతో భారీ ఊరేగింపు చేపట్టారు. వేకువజాము నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పద్మశాలిల భవిష్యత్‌పై కార్యచరణ


మాట్లాడుతున్న రామకృష్ణ

శ్రీకాకుళం: జిల్లాలో ఉన్న పద్మశాలిలకు ప్రత్యేక గుర్తింపును తీసుకురావాలని పద్మశాలి జిల్లా ప్రెసిడెంట్ పసగడ రామక్రిష్ణ అన్నారు. రిమ్స్ సమీపంలోని పద్మశాలి జిల్లా శాఖ కార్యాలయంలో భవిష్యత్ కార్యాచరణ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కమిటీలు వేసుకుని సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో గిడుతురు నీలాద్రి , శేషగిరి, షణ్ముఖరావు, నర్సింగరావు, రామారావు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని దేవరవలసలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 75 ఏళ్ల క్రితం గాంధీజీ కలలు కన్న స్వరాజ్యం ఇప్పుడు చూస్తున్నామన్నారు. గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థల వైపు ఇతర రాష్ట్రాల ప్రజలు చూస్తున్నారన్నారు. ప్రతి గ్రామానికీ విద్య, వైద్యం, తాగు, సాగునీరు ఇతర మౌలిక సదుపాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ఇందు కోసం ప్రజలు సహకరించాలని కోరారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్‌కు దీటుగా తయారు చేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, జేసీఎస్ కన్వీనర్ దోల వెంకటరమణ, జిల్లా సెంట్రల్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ తిరుమరెడ్డి గౌరీశంకరరావు, మహిళా కన్వీనర్ కంది రమాదేవి, సర్పంచ్‌లు తిరుమరెడ్డి వెంకటరావు, ఎంపీటీసీ సభ్యురాలు తిరుమరెడ్డి విజయలక్ష్మి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటసాయి, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుమరెడ్డి రమణమ్మ, తిరుమరెడ్డి లక్ష్మణరావు, జక్కంపూడి రమణ, పైడిలింగం, జనపాల ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర చట్టం చేయాలి


కరపత్రాలు ప్రదర్శిస్తున్న సంఘం నాయకులు

రణస్థలం: హమాలీ, కలాసీల సమగ్ర చట్టం చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాలని హమాలీల రాష్ట్ర ఫెడరేషన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చిన్నారావు, కె.సూరయ్య డిమాండ్ చేశారు. రణస్థలం మండలంలోని జే.ఆర్.పురం పంచాయతీలో ఇటీవల చనిపోయిన కలాసి మన్నెల లక్ష్మడుకు సంతాపం తెలిపారు. హమాలీలు, కలాసీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హమాలీ, కలాసీలకు పని భద్రత, గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, పెన్షన్ పథకాలతో కూడిన సమగ్ర చట్టం చేయాలని, సమగ్ర చట్టం అమల కోసం వెల్ఫేర్ బోర్డు, సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మార్కెటింగ్ యార్డులు, బజారు కొట్లు, పండ్లు, కూరగాయల మార్కెట్లు, ఆర్టీసీ, ప్రభుత్వ, ప్రైవేట్ గొడౌన్లు, ఎఫ్‌సీఐ, వేర్ హౌస్, సివిల్ సప్లయ్, రైస్ మిల్స్ తదితర సంస్థల్లో సుమారు 8 లక్షల మంది ముఠా కార్మికులు పనిచేస్తున్నారని అన్నారు. వీరికి పని భద్రత లేదని, కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. ఈ సమావేశంలో కలాసీ సంఘం నాయకులు మహాలక్ష్మినాయుడు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ, కలాసీలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు


ముగ్గులు వేస్తున్న మహిళలు


గార: ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు

శ్రీకాకుళం అర్బన్: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం మహిళా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా మహిళలకు శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అలాగే హైస్కూల్ విద్యార్థులకు 'గ్రంథాలయాలు డిజిటలైజేషన్ ఆవశ్యకత' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా వరం పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు రామదాసు, సెయింట్ పాల్స్ పాఠశాల ఉపాధ్యాయురాలు జి.ఉష, సోడవరపు ఈశ్వరరావులు వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు, డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్. శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి పాల్గొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం ఉదయం నిర్వహించనున్న కార్యక్రమంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

గార: గార గ్రంథాలయంలో కూడా ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కుమార్ స్వామి, జనార్దన్, అప్పలనాయుడు, కృష్ణారావు, లైబ్రేరియన్ ఎస్.రామకృష్ణ, చింతల సూర్యనారాయణ ఉన్నారు.

ఇందిరాగాంధీకి ఘనంగా నివాళి


ఎచ్చెర్ల గ్రంథాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

శ్రీకాకుళం అర్బన్: భారతదేశ ఉక్కు మహిళ, భారతరత్న, భారతదేశ మొదటి మహిళా ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ అని పలువురు కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా శ్రీకాకుళంలోని ఇందిరావిజ్ఞాన్‌భవన్ ఆవరణలో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల్లో భారతదేశానికి గుర్తింపు తీసుకొచ్చిన వ్యక్తి ఇందిరాగాంధీ అన్నారు. ఎన్నో అనితర సాధ్యమైన సంస్కరణలతో భారతదేశాన్ని ఆర్థికంగా బలపరిచారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శులు పైడి నాగభూషణరావు, అంబటి కృష్ణారావు, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రెల్ల సురేష్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు డేశ్ల గోవింద మల్లిబాబు, మంత్రి నరసింహమూర్తి, రెహమాన్, రమేష్ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల మండలంలో..


ధర్మవరం గ్రంథాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల, ధర్మవరం గ్రంథాలయాల్లో మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఆమె గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం గ్రంథాలయ ఆవరణలో విద్యార్థినులకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారులు నీలమ్మ, మలిపెద్ద చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

మంత్రి బొత్సకు యువనేత పరామర్శ

శ్రీకాకుళం రూరల్: గుండె శస్త్రచికిత్స అనంతరం హైదరాబాద్‌లోని స్టార్ ఆస్పత్రిలో ఉన్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు ఆదివారం పరామర్శించారు. ఆయన యోగక్షేమాలను మంత్రి తనయుడు సందీప్‌తో మాట్లాడి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

గోరువానిపేటలో సత్యసాయి నామసంకీర్తన


నామసంకీర్తన చేస్తున్న దృశ్యం

గార: గోరువానిపేటలో సత్యసాయి 98వ జన్మదినోత్సవాలు సందర్భంగా స్థానిక భజన మండలి ఆధ్వర్యంలో వంద పాటలతో ఆదివారం నామసంకీర్తన జరిగింది. మండలంలోని సతివాడ, శ్రీకూర్మం, సాండిపేట, తూలుగు, యాళ్లపేట భజనమండలి భక్తులు నామసంకీర్తనలో పాల్గొన్నారు. శ్రీకాకుళానిక చెందిన భవానీసాయిరాం స్వామి సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో కన్వీనర్ సూర్యనారాయణ, ఆదినారాయణ, పాపారావు పాల్గొన్నారు.

లీలా వరప్రసాద్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు


లీలావరప్రసాద్‌కు అవార్డు అందజేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గుంట లీలా వరప్రసాద్‌కు అబ్దుల్ కలాం ఎక్స్‌లెన్స్ అవార్డు దక్కింది. తిరుపతికి చెందిన సంకల్ప సేవా సమితి ఈ అవార్డును ఆదివారం తిరుపతిలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. చరిత్ర, సాహిత్యం, అధ్యయన జర్నలిజం అంశాల్లో ప్రతిభకు ఈ అవార్డును అందించారు. సంకల్ప సేవా సమితి అధ్యక్షుడు ఎస్.రాజారెడ్డి, కార్యదర్శి షేక్ మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

కుళాయి కనెక్షన్లకు మోటార్లు బిగిస్తే చర్యలు


వరం కాలనీలో మోటార్లను తొలగిస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ) : కార్పొరేషన్ పరిధిలో మంచినీటి కుళాయి కనెక్షన్‌కు మోటార్లు బిగించి తోడేస్తుండటంతో శివారు ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో స్పందనలో వచ్చిన ఫిర్యాదు మేరకు వరం కాలనీలో 35 మోటార్లను కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది శనివారం తొలగించారు. కార్పొరేషన్ పరిధిలో ఏ ప్రాంతంలోనైనా ఇటువంటి మోటార్లు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

శరవేగంగా కాలువల నిర్మాణం


విశాఖ-ఎ కాలనీలో కాలువ నిర్మాణం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

నగరంలో కాలువలు, రోడ్లు లేని వీధులు ఉండకూడదన్న లక్ష్యంతో మంత్రి ధర్మాన ప్రసాదరావు కృషితో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన ప్రతి పనిని శరవేగంగా పూర్తిచేస్తున్నారు. విశాఖ-ఎ కాలనీ, కిల్లిపాలెం-2 సచివాలయం పరిధిలో రూ 6.80 లక్షలతో నిర్మిస్తున్న కాలువ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నాణ్యతతో పనులు చేపట్టాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని మున్సిపల్ ఇంజినీర్లు హెచ్చరిస్తున్నారు.

ఘనంగా పల్లకీ ఉత్సవం


సత్యం శివం సుందరం మందిరంలో మహిళల పల్లకీ ఉత్సవం


న్యూకాలనీ మందిరంలో మహిళలచే విభూతి అర్చనలు

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయిబాబా 98వ జన్మదిన వేడుకల్లో భాగంగా పలు మందిరాల్లో మహిళా దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఏపీ హెచ్‌బీ కాలనీలోని సత్యం, శివం, సుందరం మందిరంలో మహిళల ఆధ్వర్యంలో పల్లకీ ఉత్సవం జరిగింది. అనంతరం ప్రశాంతి పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో మందిరం కన్వీనర్ వల్లభ తదితరులు పాల్గొన్నారు.

980 మహిళలతో విభూతి అర్చన

న్యూకాలనీ, చిన్నపుట్టపర్తి మందిర్‌లో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 980 మంది మహిళలచే సత్యసాయి మహామంత్ర విభూతి అర్చనలు జరిగాయి. మహిళలచే కేక్ సమర్పణ జరిగింది.

ఘనంగా గురజాడ వర్ధంతి

- సాహితీ సంస్థలు తీర్మానం


సమావేశంలో సాహితీ సంస్థల ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: గురజాడ అప్పారావు వర్ధంతిని ఈ నెల 30వ తేదీన ఘనంగా నిర్వహించాలని పలు సాహితీ సంస్థలు తీర్మానం చేశాయి. స్థానిక కథానిలయంలో సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాస్ అధ్యక్షతన కవులు, రచయితల సంఘాల ప్రతినిధులు కార్యాచరణ ప్రణాళికను ఆదివారం రూపొందించారు. అరసవం రాష్ట్ర అధ్యక్ష వర్గ సభ్యులు నల్లి ధర్మారావు మాట్లాడుతూ.. గురజాడ రచనలు, ఆలోచనలు 150 ఏళ్ల క్రితం అయినా నేటి పరిస్థితులను ప్రతిబింబిస్తాయని అన్నారు. శ్రీకాకుళ సాహితీ ప్రధాన కార్యదర్శి దాసరి రామచంద్రరావు మాట్లాడుతూ.. తదనుగుణంగా శాస్త్ర విజ్ఞానం, మహిళా సాధికారత, కులవివక్ష, నిరుద్యోగం, ఉపాధి, ఆర్థిక వృద్ధి వంటి అంశాలపై వర్ధంతి సభలో చర్చిస్తామన్నారు. జనసాహితీ, తెలుగు రచయితల వేదిక ప్రధాన కార్యదర్శులు పి.మోహనరావు, ఆర్‌వీ రమణమూర్తిలు మాట్లాడుతూ విద్యార్థులు, యువజనులను భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమ నిర్వహణకు సహకరిస్తామని గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎం.ప్రభాకరరావు, బాలకథానిలయం అధ్యక్షుడు ఉమా కవి తెలిపారు. సమావేశంలో ప్రముఖ కవులు కంచరాన భుజంగరావు, నెట్టిమి రమణారావు, తంగి ఎర్రమ్మ, ఉత్తరావిల్లి నాగేశ్వరరావు, చింతాడ తిరుమలరావు, మల్లి పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ప్రముఖులు


ఎమ్మెల్సీ కల్యాణికి జ్ఞాపికను అందజేస్తున్న ఈవో హరిసూర్యప్రకాష్, ట్రస్ట్‌బోర్డు సభ్యుడు రవి


ఎస్‌ఈ కృష్ణమూర్తి దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఏపీ శాసన మండలి సభ్యురాలు, అరసవల్లి ఆలయ పునర్నిర్మాణ కుటుంబీకులు వరుదు కల్యాణి, విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు తదితరులతో పాటు స్థానిక జిల్లా విద్యుత్ సర్కిల్ ఎస్‌ఈ ఎస్.కృష్ణమూర్తి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ పాలక మండలి సభ్యుడు మండవిల్లి రవి, ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. వీరి వెంట ఏఈ కమల్‌హాసన్, ఉంగటి పాపారావు తదితరులున్నారు.

ప్రాథమిక చికిత్సపై శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రాథమిక చికిత్సపై శిక్షణ కార్యక్రమం అనురాగ నిలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వైద్యులు జి.ఆర్.శ్రీకాంత్, సుమన్‌లు ప్రాథమిక చికిత్స అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే అగ్ని ప్రమాదాలు, ఎముకలు విరగడం, కట్లు, విషసర్పముల కాట్లు, కృత్రిమశ్వాస, కాలిన గాయాలు, గుండెపోటు, సీపీఆర్, తదితర అంశాలపై ప్రదర్శన ఇచ్చారు.

ఘనంగా 'ఐథాన్ టెక్‌ఫెస్ట్'


ప్రొఫెసర్ రామకృష్ణను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్‌కాలేజ్ రోడ్‌లో ఉన్న కాకినాడ శ్రీఆదిత్య డిగ్రీ కళాశాలలో నిర్వహించిన టెక్‌ఫెస్ట్ ఐథాన్-2023 కార్యక్రమం ముగిసింది. కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ ఎస్.వి. వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు ప్రసంగించి విద్యార్థి దశలో అందిపుచ్చుకోవాల్సిన నైపుణ్యాల గురించి వివరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి జి.రామకృష్ణ విద్యార్థులకు అభ్యసించిన, నేర్చుకున్న అంశాలను ప్రాక్టికల్‌గా అమలు చేయాలని సూచించారు. ప్రోగ్రామింగ్, కోడింగ్ అంశాలలో నైపుణ్యం సాధించాలన్నారు ఈ సందర్భంగా విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్, సెమినార్ క్విజ్ ప్రోగ్రాం పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కళాశాల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ డి.విక్రమ్, సీఎస్ హెచ్‌వోడీ జీజీవీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


ఘనంగా జగన్నాథస్వామి రథయాత్ర

రణస్థలం: మండలంలోని కోష్ట గ్రామ సమీపంలో ఉన్న కృష్ణచైతన్య మఠం, గో–సేవ ఆశ్రమం, త్రిదండి స్వామి కేశవ మహారాజ్ వారి ఆధ్వర్యంలో రణస్థలం మండల కేంద్రంలో గోపాష్టమి (గోమాత జన్మదినోత్సవం) సందర్భంగా జగన్నాథ, సుభద్ర, బలరామ స్వామి రథయాత్ర ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు భారీగా హాజరయ్యారు. పలు ఆధ్యాత్మిక, సంస్కృతిక, కోలాట కార్యక్రమాలతో రథయాత్ర సాగింది. గోపాష్టమి సందర్భంగా గోశాలలో సోమవారం మహా అన్న ప్రసాద కార్యక్రమం ఉందని, భక్తులందరూ విచ్చేసి ప్రసాదం స్వీకరించాలని కోష్ట గ్రామస్తులు కోరారు.

డివైడర్‌ను ఢీకొట్టి కారు బోల్తా

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని సింగుపురం జ్యూ మిల్ వద్ద ఆదివారం మధ్యాహ్నం విశాఖ నుంచి పలాస వెళ్తున్న ఓ కారు డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు ప్రమాదాన్ని గమనించి 108 అంబులెన్స్‌కు ఫోన్‌చేసి క్షతగాత్రులను రాగోలులోని జెమ్స్ ఆస్పత్రికి తరలించారు.

జ్యోతియే పరబ్రహ్మ స్వరూపం


హరనాథరావును సత్కరిస్తున్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: జ్యోతిని పరబ్రహ్మస్వరూపంగా భావించి ఉపాసించే సంస్కృతి మనదని ప్రముఖ అష్టావధాని పైడి హరనాథరావు అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో ఆదివారం సత్సంగంలో 'కార్తీకమాసం-దీప వైశిష్ట్యం' అనే అంశంపై ప్రసంగం జరిగింది. దీపారాధన అనేది పూర్వీకుల నుంచి వచ్చిన ఆచారమన్నారు. ముందుగా వక్త హరనాథరావును మందిరం సభ్యులు సత్కరించారు. సనపల నారాయణమూర్తి, ప్రభాకరరావు, బలగ తవుడు, ఎస్ఎస్ఎన్ స్వామి, ఈశ్వరరావు, వెంకటరావు, కోమలరావు, కామేశ్వరరావు, బాబూరావు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఏపీహెచ్‌బీ కాలనీలోని సత్యసాయి మందిరంలో జరుగుతున్న సత్యసాయి జయంతి ఉత్సవాల్లో భాగంగా మహిళా దినోత్సవం సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు చక్కనైన ముగ్గులు వేసి దీపాలను వెలిగించారు.